'మిచాంగ్'.. ముసురు



కొత్తపేటలోని ఎల్‌బీనగర్ జాతీయ రహదారిపై వర్షంలో ప్రయాణిస్తున్న వాహనదారులు

దిల్‌సుఖ్‌నగర్: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో మలక్‌పేట జోన్ పరిధిలోని ప్రాంతాలు కాలనీల్లో నీరు నిలిచింది. మంగళవారం ఉదయం నుంచి నెలకొన్న ముసురు, చలిగాలులతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. వర్షం కారణంగా వాహనదారులు కొద్ది పాటి అవస్థలను ఎదుర్కొన్నారు. మలక్‌పేట జోన్ పరిధిలోని దిల్ సుఖ్‌నగర్, మలక్‌పేట, అక్బర్‌బాగ్, ఓల్డ్‌మలక్‌పేట, మున్సిపల్ కాలనీ, పద్మానగర్, చాలాదేరా, మలక్‌పేట రైల్వే బిడ్జి, ఆజంపురా, సైదాబాద్, సరూర్‌నగర్, ఆర్‌కేపురం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని కాలనీలు, బస్తీల్లో కొద్దిపాటి వర్షం కురిసింది.

వర్షానికి గుంతలమయంగా రోడ్లు

అవస్థలు పడుతున్న వాహనదారులు



బండ్లగూడలో గుంతలు పడ్డ రోడ్డు



నాగోలు: మిచాంగ్ తుపాన్‌తో కురుస్తున్న వర్షాలకు ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల్లో అంతర్గత రహదారులు గుంతలు పడి బురదమయంగా మారాయి. నాగోలు డివిజన్ బండ్లగూడ చౌరస్తాలో కొద్ది రోజుల క్రితం జలమండలి అధికారులు డ్రైనేజీ కోసం రోడ్డును తవ్వారు. పని పూర్తయ్యాక సక్రమంగా రోడ్డును పూడ్చకుండా వదిలేశారు. మిచాంగ్ తుపాన్ వల్ల మంగళవారం కురిసిన వర్షానికి రోడ్డుపై మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు కంకర తేలి గుంతల్లో వర్షం నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం

హుడాకాంప్లెక్స్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయపురికాలనీ భవన్‌లో సీనియర్ సిటిజన్స్‌కు మొబైల్ మెడికల్ కేర్ యూనిట్ ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో దాదాపు వంద మందికి బీపీ, షుగర్, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం సలహాదారు గోవర్ధన్, కాలనీ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, నిరంజన్‌రావు, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అయోధ్య రామమందిర అక్షింతల పంపిణీ

కాచిగూడ: శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 6న మధ్యాహ్నం 12 గంటలకు కాచిగూడ, శ్రీశ్యాంబాబా మందిర్‌లో శ్రీరామ పూజిత అక్షింతల వితరణ ఉంటుందని భాగ్యనగర్ ప్రచారప్రముఖ్ భరత్ వంశీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, పీఠాధిపతులు, సాధుసంతుల చేతుల మీదుగా శ్రీ రామ అక్షింతలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

సుల్తాన్‌బజార్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. ప్రతిమ హాస్పిటల్, బజరంగ్‌సేన సంయుక్త ఆధ్వర్యంలో కోఠి బ్యాంక్ స్ట్రీట్ వద్ద మంగళవారం గాంధీ పార్కులో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఆర్.లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. దైనందిన జీవితంలో ప్రజల్లో ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరిగిందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు ప్రతిరోజూ నడక, చిన్నపాటి వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటున్నారని ఆయన తెలిపారు. వైద్య శిబిరాల ద్వారా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించుకుని వారికి కావాల్సిన మందులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు విజయ్ రమేష్ భాస్కర్‌రెడ్డి పాండేతో పాటు వైద్యులు వారి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 37 మందిపై కేసులు

బహదూర్‌పురా: బహదూర్‌పురా ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్‌లో 37 మంది కేసులు నమోదు చేసి వాహనదారులను నాంపల్లిలోని 9వ ఎంఎం కోర్టులో హాజరుపర్చగా..న్యాయమూర్తి 29 మందికి జరిమానాలు విధించారు. 8 మందికి జైలు శిక్షతో పాటు జరిమానాలు విధించారు. ఇందులో ఇద్దరికి ఐదు రోజుల జైలు శిక్ష, జరిమానా, నలుగురికి నాలుగు రోజుల జైలు శిక్ష, జరిమానా, ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, జరిమానాలు విధించినట్లు బహదూర్‌పురా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరుణా కుమార్ తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

గౌలిపురా: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లి లోని స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ తలాబ్ కట్ట ప్రాంతానికి చెందిన ఓబైద్ బిన్ సలాం (43) ఈనెల 3న ఎన్నికల ఫలితాల సందర్భంగా స్థానికంగా సౌండ్ బాక్సులు పెట్టి న్యూసెన్స్ సృష్టించాడు. పోలీసులు సౌండ్ బాక్స్‌లను ఆపాలని సూచించడంతో దురుసుగా మాట్లాడి వారి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో పోలీసులు ఓబైద్ బిన్ సలాం అరెస్టు చేసి మంగళవారం నాంపల్లిలోని నాలుగో స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా..మెజిస్ట్రేట్ సత్యనారాయణ నిందితుడికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పోలీసులు ఓబైద్ బిన్ సలాంను చంచలగూడ జైలుకు తరలించారు.

అభివృద్ధే మళ్లీ గెలిపించింది

చంపాపేట: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా, ఎమ్మెల్యేగా దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఎల్‌బీనగర్ నియోజకవర్గ వాసులతో నిత్యం మమేకమై అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన ఎల్బీనగర్ అభివృద్ధే తన ధ్యేయమంటూ టీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అదే విధంగా ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో నిధులు తీసుకొచ్చి పలు అభివృద్ధి పనులు చేపట్టి ప్రధాన సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారు. కళ్లెందుటే కనిపిస్తున్న అభివృద్ధి, కాలనీవాసులతో నిత్యం కలిసి సమస్యలు తెలుసుకునే ఆయన స్వభావమే తాజా ఎన్నికల్లో సుధీర్‌రెడ్డికి ఎల్‌బీనగర్ వాసులు భారీ మెజారిటీతో మళ్లీ ఎమ్మెల్యేగా పట్టం కట్టారని పలువురంటున్నారు.

58–59, 118 జీఓలు రక్షించడంలో ప్రత్యేక శ్రద్ధ

నియోజకవర్గంలోని పలు మురికివాడలు, ప్రభుత్వ స్థలాలలో స్థిర నివాసంఏర్పాటు చేసుకున్న పేదలకు జీఓ 58, 59 ద్వారా ఇంటి పట్టాలు అందించటంతో పాటు ప్రభుత్వ పెద్దలను ఒప్పించి ప్రత్యేక జీఓ 118 ద్వారా దశాబ్దాల తరబడి రిజిస్ట్రేషన్లకు నోచుకోని ఇళ్ల, ఖాళీ ప్లాట్ల రిజిస్ట్రేషన్ల సమస్యను సుధీర్‌రెడ్డి పరిష్కరించారు. అలాగే, బాక్స్‌డ్రైన్ వరద నీటి ట్రంక్ లైన్లు నిర్మించి వర్షం వచ్చినప్పుడు కాలనీలు ముంపునకు గురి కాకుండా చేయడం వంటివి మళ్లీ ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు దోహదం చేశాయి.

సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



సుధీర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళలు



శుభాకాంక్షలు తెలుపుతున్న వనస్థలిపురం నాయకులు రవికుమార్, శ్రీధర్‌గౌడ్

పార్కులు, చెరువుల సుందరీకరణ, రోడ్ల విస్తరణ, కాలనీ సంక్షేమ సంఘ భవనాల నిర్మాణాలు వంటి అభివృద్ధి పనులు ఆయనకు ప్రత్యేక గుర్తింపు తెచ్చా యని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మార్నింగ్ వాక్‌తో ప్రజలను కలుసుకోవడం..

నియోజకవర్గ పరిధిలోని కాలనీల్లో ప్రతి రోజూ మార్నింగ్‌వాక్ పేరిట సుధీర్‌రెడ్డి పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలను ప్రత్యక్షంగా చూసేవారు. స్థానికులను కలుసుకొని వారు చెప్పే సమస్యలను ఓపిగ్గా విని పరిష్కారానికి చర్యలు తీసుకొనేవారు. అందువల్లే తాజా ఎన్నికలలో కాంగ్రెస్ పవనాలు వీచినా, ప్రత్యర్థులు ఆరోపణలు గుప్పించినా వాటన్నిటినీ తట్టుకుని భారీ విజయం సాధించాడని విశ్లేషకులు భావిస్తున్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న మున్నూరు కాపు నాయకులు

సన్మానాలు.. అభినందనలు

ఎమ్మెల్యేగా ఎన్నికైన సుధీర్ రెడ్డిని మంగళవారం పలువురు నాయకులు కలిసి శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. నాగోలు మాజీ కార్పొరేటర్ చెర్కు సంగీత ప్రశాంత్‌గౌడ్, తూర్పాటి కృష్ణ, ఎల్‌బీనగర్ ఎస్సీ సెల్ నాయకుడు మల్లెపాక యాదగిరి, డప్పు వినోద్‌కుమార్, అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మైలేకోల్ మహేందర్ యాదవ్ కలిసి అభినందించారు. అలాగే, మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్ పులిపాటి త్రివేది, గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, వనస్థలిపురం బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చింతల రవి శుభాకాంక్షలు తెలిపారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 15, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 28, కాకర 35, బీర 35, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 25, దొండ 28–35, చిక్కుడు 18–35, గోకర 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 40, అలు 23, దోస 23, సొర 11, పొట్ల 15, ఉల్లిగడ్డ 34, చామగడ్డ 23. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా మహిళకు అవకాశం ఇవ్వాలి



పద్మావతి

చాదర్‌ఘాట్: తెలంగాణ వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవిని మహిళకు కేటాయించాలని ప్రముఖ కళాకారిణి, రాష్ట్రపతి అవార్డ్ గ్రహీత పద్మావతి కోరారు. మంగళవారం ఆమె మలక్‌పేటలో మాట్లాడుతూ, దివ్యాంగ మహిళలకు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న విలువ తెలంగాణ ఏర్పడ్డాక పోయిందన్నారు. అధిక వైకల్యం ఉన్నవారి సమస్యలు పరిష్కారం కావాలంటే వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి చైర్ పర్సన్‌గా అవకాశం ఇవ్వాలన్నారు. దశాబ్ద కాలంగా దివ్యాంగులకు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు సమాన అవకాశాలు ఇస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజా నిర్ణయాన్ని శిరసావహిస్తాం



విలేకరులతో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

- ఓటమికి గల కారణాలను విశ్లేషించుకుంటాం
- గత ఎన్నికలతో పోల్చితే బలపడ్డాం
- ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ప్రజాక్షేత్రంలో గెలుపోటములు సహజమని, గత ఎన్నికలతో పోల్చితే ఎల్‌బీనగర్‌లో బీజేపీ బాగా బలపడిందని బీజేపీ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ చంద్రపురి కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018 పార్లమెంట్ ఎన్నికల నుంచి ఎల్‌బీనగర్‌లో బీజేపీ బాగా పుంజుకుందని, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఎల్‌బీనగర్‌లోని 11 స్థానాల్లో విజయం సాధించి రికార్డు సృష్టించిందని తెలిపారు. 2023 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు, కార్పొరేటర్లు, నాయకుల కృషితో 89 వేల ఓట్లను సాధించామని, ఓటమికి గల కారణాలు విశ్లేషించి తప్పులను సరి చేసుకుంటామన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కృషి చేసిన కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, బీజేపీకి ఓటేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి గతంలో మాదిరిగానే కార్పొరేటర్లు, నాయకులు ఎల్‌బీనగర్ అభివృద్ధికి సహకరిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బద్దం ప్రేమమహేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహగుప్తా, కళ్లెం నవజీవన్‌రెడ్డి, మొద్దు లచిరెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, చింతల సురేందర్‌యాదవ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గంగదాసు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇక్కడ గెలిస్తే.. ప్రతిపక్షంలో కూర్చోవాల్సిందే!

ఎల్‌బీనగర్ తీర్పు విలక్షణం గురూ!



ఈ నెల 3న ఇండోర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు దృశ్యం

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఏ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించినప్పటికీ రాష్ట్రంలో మాత్రం ఇక్కడ గెలిచిన పార్టీకి వ్యతిరేకంగా తీర్పు వస్తుంది. గత ఎన్నికలను పరిశీలిస్తే 2014లో ఇక్కడ నుంచి టీడీపీ అభ్యర్థి ఆర్. కృష్ణయ్య విజయం సాధించారు. అప్పట్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి 2వ స్థానంలో, కాంగ్రెస్ అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. రాష్ట్రంలో మాత్రం టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటైంది. తిరిగి 2018లో ఇక్కడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం సాధించగా, టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన రామ్మోహన్‌గౌడ్ రెండోవ స్థానంలో, బీజేపీ అభ్యర్థి పేరాల శేఖర్‌రావు మూడో స్థానంలో నిలిచారు. అప్పుడు కూడా రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వమే ఏర్పాటైంది. ఇక ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం సాధించినా రాష్ట్రంలో మాత్రం కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని అధికారంలోకి వచ్చింది.

- ఇక్కడి నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి రెండో స్థానంలో నిలవగా, కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ మాత్రం మూడో స్థానంలో నిలిచారు.

అంటే.. ఎల్‌బీనగర్‌లో పోటీ చేసిన అభ్యర్థులు విజయం సాధిస్తే అధికారం మాత్రం వేరే పార్టీకి వస్తుందని స్పష్టం అవుతోంది. ఇక్కడ నుంచి పోటీ చేసిన అభ్యర్థి విజయం సాధిస్తే ప్రతిపక్షంలోనే కూర్చోవాల్సి వస్తుందనేది తేటతెల్లమౌతోంది.

కరాటేతో ఆత్మరక్షణ

కాచిగూడ: ప్రస్తుత పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్, ఎగ్జామినర్ రాపోలు సుదర్శన్ అన్నారు. జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడలోని కర్ణాటక సాహిత్య మందిర్‌లో నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు సర్టిఫికెట్లు, కలర్ బెల్టులు ప్రదానం చేశారు. కర్ణాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు విఠల్ జోషి, నరసింహామూర్తి, కరాటే కోచ్ దామోదర్ నాయక్, ఇన్‌స్ట్రక్టర్ కృష్ణ పాల్గొన్నారు.



అందరికీ రుణపడి ఉంటా

మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఆర్‌కేపురం డివిజన్ మహిళా కార్యకర్తలు



అభినందిస్తున్న సరూర్‌నగర్ డివిజన్ నాయకులు



వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదయ్యగౌడ్, లైన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ లయన్ డాక్టర్ విజయరంగా

దిల్‌సుఖ్‌నగర్: మంచి పాలన అందిస్తాననే నమ్మకంతో తనను నియోజకవర్గ ప్రజలు మరోసారి గెలిపించారని, వారందరికీ రుణపడి ఉంటానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన సబితా ఇంద్రారెడ్డి మంగళవారం ఆర్‌కేపురం డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ, తన విజయం కోసం కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచి మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీ వాసులు, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి సబితారెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ముదుకుంట్ల అరవింద్ శర్మ, బేర బాలకిషన్, పెండ్యాల నగేష్, సాజిద్, లోకసాని కొండల్‌రెడ్డి, మహేందర్ యాదవ్, శ్యామల శైలజ, ఊర్మిలారెడ్డి, సునీతాపటేల్, శ్రీనివాస్, శేఖర్, కొండ్ర శ్రీనివాస్, రాజేష్‌గౌడ్, రాజు, రవీందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దినందుకే ప్రజలు తనకు పట్టంకట్టారని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రెట్టింపు ఉత్సాహంతో మరింత అభివృద్ధి చేస్తానని ఎల్‌బీనగర్ శాసన సభ్యుడు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అండోజు సత్యంచారితో కలిసి కంచర్ల శివారెడ్డి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్‌ను ఎంతో అభివృద్ధి చేశానని ఇంకా చేయాల్సింది ఎంతో ఉందని, తగిన ప్రణాళికలు సిద్ధం చేసి అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నారగోని శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, శ్రీనివాస్‌నాయక్, ఆదిలక్ష్మి, బాలం ఈశ్వర్, అనిత, విజయ పాల్గొన్నారు.



ఎమెల్యే సుధీర్‌రెడ్డిని సత్కరిస్తున్న కంచర్ల శివారెడ్డి, సత్యంచారి

బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

ఉప్పల్: ఆలేరు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన బీర్ల ఐలయ్య కురుమకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరుతూ ఉప్పల్ కురుమ సంఘం ఆధ్వర్యంలో ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ప్రతినిధులు కోరారు. రాజకీయంగా వెనుకబడి ఉన్న కురుమల్లో బీర్ల ఐలయ్య విజయం సాధించారని, రాష్ట్రంలో ఉన్న 50 లక్షల కురుమలకు ప్రతినిధిగా ఉన్న బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గొరిగే మల్లేష్, ఉపాధ్యక్షుడు గొరిగే రమేష్, రేవు కృష్ణయ్య, గొరిగే పెద్ద మల్లేష్, బెల్లం గట్టయ్య, చౌదరిపల్లి పర్వతాలు, చిందం వెంకటేష్, గొరిగే మల్లేష్, జన్ని రఘు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కాచిగూడ: శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షాబాద్ వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా కాసుల వినోద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సలహాదారుగా కొండూరు వినోద్ కుమార్, షాబాద్ కరుణ వెంకటేశం, మింట ఆనంద్‌రావు, మార్గం విజయ్ కుమార్, ఆరికెల వంశీ, అద్దోజి చక్రపాణి, మాధవ్, మింటు విష్ణువర్ధన్, గోపిశెట్టి నరేందర్, కాసుల విశాంత్‌లను ఎన్నుకున్నారు.

రిజిస్ట్రేషన్లు ప్రారంభం



రామంతాపూర్‌లో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రామంతాపూర్: కొన్ని సంవత్సరాలుగా ఉప్పల్ లక్ష్మారెడ్డి కాలనీలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామంతాపూర్ శ్రీనగర్‌కాలనీలో నూతనంగా నిర్మించిన అద్దె భవనంలోకి తరలించారు. కార్యాలయంలో మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉప్పల్‌లో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో స్థానిక ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని పలు ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామంతాపూర్‌కు తరలించినట్లు తెలిపారు.

స్థలం.. నిధులు మంజూరైనా నిర్లక్ష్యమే..

కొత్తగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణానికి ఉప్పల్ భగాయత్ సమీపంలో 500 గజాల స్థలం, రూ.50 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసి ఏళ్లు గడుస్తున్నా అప్పటి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఉప్పల్ భగాయత్ సమీపంలో కేటాయించిన సొంత స్థలంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయ భవనాన్ని నిర్మించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛంద సేవలోనే సంతృప్తి

అంబర్‌పేట: స్వచ్ఛంద సేవలలో ఎంతో సంతృప్తి ఉంటుందని రాచకొండ అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం గోల్నాకలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. కాచిగూడ ఏసీపీ శ్రీనివాస్‌తో కలిసి రాచకొండ అడిషనల్ డీసీపీ వెంకటరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సేవా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. ఏటా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త చందర్‌పాల్, అసోసియేషన్ ప్రతినిధులు కె.విజయకుమార్, ఎస్ పాండురంగం, మధు తదితరులు పాల్గొన్నారు.